క్లుప్తంగా

స్పోర్ట్స్ హాస్టల్‌కు విద్యార్థుల ఎంపిక



దామెర : స్పోర్ట్స్ హాస్టల్‌కు మండలంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ లకావత్ రాజేష్‌కుమార్ బుధవారం తెలిపారు. పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థిని పి.రమ్య, 4వ తరగతి విద్యార్థి బి.నిఖిల్ ఇటీవల జేఎస్ఎస్‌లో నిర్వహించిన క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి హనుమకొండ ప్రాంతీయ స్పోర్ట్స్ హాస్టల్‌కు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ దేవేందర్, ప్రధానోపాధ్యాయురాలు సబితాదేవి, ఉపాధ్యాయులు సహన లత, మాధవి, కవిత అభినందించారు.

దంచి కొట్టిన వాన



శాయంపేట : మండలంలో బుధవారం మధ్యాహ్నం ఒక గంటపాటుభారీ వర్షం కురిసింది. నాలుగు రోజులుగా ఎండతాపంతో సతమతమైన రైతులు, స్థానికులు ఈ వర్షంతో కొంత ఉపశమనం పొందారు. పత్తి, వరి పంటలు సాగు చేసిన రైతులు సంతోషించారు. ముందస్తుగా విత్తనాలు విత్తిన రైతులు మాత్రం కొంత మేర నష్టపోతారని పలువురు తెలిపారు.

జీపీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

దామెర : గ్రామపంచాయతీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ మండల కార్యదర్శి యజ్ఞం సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ .. కాంగ్రెస్ మానిఫెస్టోలో ప్రకటించిన విధంగా జీఓ 51 రద్దు చేసి జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. కారోబార్లు, బిల్ కలెక్టర్లకు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శి హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే విధంగా ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందజేయాలని కోరారు.

కేవీపీఎస్ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఐనవోలు : కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) ఆశయాలను, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి దళిత సామాజిక వర్గాలు ముందుకొచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి గబ్బెట రాంకుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కేవీపీఎస్ 26వ వార్షికోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంకుమార్ మాట్లాడుతూ.. 1998 అక్టోబర్ 2న కేవీపీఎస్ ఆవిర్భవించిందని తెలిపారు. ఈనెల 5 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. కుల వివక్షను రూపుమాపాలని, అందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాదాసి యాకూబ్, రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని దేవన్నపేట, అలియా తండా, మధు తండా, సుబ్బయ్యపల్లి ప్రాంతాల్లో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీ అశోక్ తెలిపారు. 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

అడవుల పునరుద్ధరణకు విత్తన బంతులు



ఖిలా వరంగల్ : అంతరించిపోతున్న అడవులను పునరుద్ధరించేందుకు విత్తన బంతులు దోహదపడుతాయని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ తోట వైద్యనాథ్ సూచించారు. ఖిలా వరంగల్ మండల పరిధిలోని నక్కలపల్లితోపాటు పలు గ్రామాల్లో వాసవి క్లబ్ స్మార్ట్ సిటీ, ఇంటర్నేషనల్ వరంగల్ అధ్యక్షుడు ఎలగందుల రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో మట్టి, పేడతో తయారు చేసిన విత్తన బంతులను బుధవారం వేశారు. ఈ సందర్భంగా వైద్యనాథ్ మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ద్వారా సుమారు రూ.2లక్షల విత్తన బంతులను ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వేయనున్నామని వివరించారు. వాసవి క్లబ్ ప్రతినిధులు పుల్లూరి శ్రీధర్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ..


ఎల్కతుర్తి : బతుకమ్మ ఆడుతున్న మహిళలు


శాయంపేట : శ్రీమత్స్యగిరిస్వామి ఆలయంలో..


నడికూడ : బతుకమ్మఆడుతున్న మహిళలు

పరకాల : పశువులసంత మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



- ప్రారంభమైన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు
- పట్టణంతోపాటు పల్లెల్లో నెలకొన్న సందడి

ఎల్కతుర్తి : తెలంగాణ సాంస్కృతీ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగా రానే వచ్చింది. బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను సాయంత్రం తీసుకుని సమీప దేవాలయాల వద్దకు చేరుకొని బతుకమ్మలను భూదేవిపైన ఉంచి ఒకరికొకరు వాయానాలు ఇచ్చిపుచ్చుకున్నారు. చిన్నారులు, మహిళలు 'ఒక్కేసి పువ్వేసి చందమామా.. ఒక్కజాము అయ్యే చందమామ' పాటలతో హోరెత్తించారు. ఇలా తొమ్మిది రోజులపాటు బతుకమ్మ వేడుకలు జరుపుకొని చివరి రోజున సద్దుల బతుకమ్మతో వేడుకలను ముగించనున్నారు. చిన్నారులు బణాసంచాలు పేల్చుతూ కేరింతలు కొట్టారు.

శాయంపేట : మండల వ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు వైభవంగా జరుపుకొన్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆయా గ్రామాల్లోని ఆలయ ప్రాంగణాల్లో బతుకమ్మ ఆడారు. శ్రీశివమార్కండేయ, శ్రీమత్స్యగిరిస్వామి ఆలయాల వద్ద, వివిధ గ్రామాల్లోని ఆలయాల వద్దకు ఆకతాయలు రాకుండా సీఐ రంజిత్ రావు, ఎస్సై ప్రమోద్‌కుమార్, ఏఎస్సై కుమారస్వామి బందోబస్తు నిర్వహించారు. శ్రీమత్స్యగిరిస్వామి ఆలయ ప్రాంగణంలో పంచాయతీ కార్యదర్శి రత్నాకర్, సిబ్బంది విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ధర్మసాగర్ : మండల కేంద్రంతో పాటు, వివిధ గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మహిళలు, చిన్నారులు తిరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు.

నడికూడ : మండంలోని పలు గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు బతుకమ్మను పేర్చి పాటలు పాడారు.

పరకాల : ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు గ్రామగ్రామాన ఘనంగా జరిగాయి. స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం (పశువుల సంత) ప్రాంగణ మైదానంలో బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేయగా బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చిన బతుకమ్మ ఆడి సందడి చేశారు. అదే విధంగా శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.

దామెర : మండల వ్యాప్తంగా బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. మహిళలు పాటలు పాడుతూ సందడి చేశారు.

వేలేరు : మండల వ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మను బతుకమ్మ స్థలాలకు వద్దకు తీసుకెళ్లిన మహిళలు, చిన్నారులు.. పాటలు పాడి సందడి చేశారు.

కమలాపూర్ : మండలంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు, యువతులు, చిన్నారులు ఆనందోత్సాహాలతో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి, సీతజడ, గుమ్మడి తీరొక్క పూలతో తయారు చేసిన బతుకమ్మలను అందంగా పేర్చి బతుకమ్మ ఆడే ప్రదేశాల వద్దకు ఊరేగింపుగా తరలివెళ్లారు.

ఆత్మకూరు : మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. మహిళలు బతుకమ్మ ఆడి సందడి చేశారు. మండల కేంద్రంలో జరిగిన బతుకమ్మ వేడుకలకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి హాజరై మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

ఐనవోలు : మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు తంగేడు, గునుగు, బంతి, చామంతి, మందార, సీతజడ, గుమ్మడి తదితర పువ్వులను సేకరించి బతుకమ్మ పేర్చారు. సాయంత్రం ఆలయాల వద్దకు బతుకమ్మలతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ ఆడారు. ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం, కక్కిరాలపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.


ఐనవోలు : మల్లన్న ఆలయంలో..


దామెర : ఊరుగొండలో..


ఆత్మకూరు : బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కమలాపూర్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వేలేరు : పీచరలో..

అహింసా నినాదమే గాంధీజీ ఆయుధం

అహింసా నినాదమే మహాత్మా గాంధీ ఆయుధమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని శాయంపేట మండల కేంద్రంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్రటానికి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి పూలమాల వేసి నివాళులర్పించారు.

- సాక్షి నెట్‌వర్క్


శాయంపేట : గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


ఎల్కతుర్తి: ఎంపీడీఓ కార్యాలయంలో..


దామెరలో..


పరకాల : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..


ఐనవోలులో..


కమలాపూర్ : పూలమాల వేస్తున్న ఆర్యవైశ్యులు

దేవాదుల పైపులైన్ లీకేజీ



దామెర : దేవాదుల పైపులైన్ లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతున్నాయి. పులుకుర్తి సమీపంలోని పంప్‌హౌజ్ నుంచి ధర్మసాగర్‌కు వెళుతున్న పైప్‌లైన్‌కు ఉన్న గేట్ వాల్వ్ వద్ద లీకేజీ ఏర్పడింది. దీంతో సింగరాజుపల్లి శివారులో నీరు వృథాగా పంటపొలాల్లోకి, కెనాల్‌లోకి పారుతుంది. సంబంధిత అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదంటు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కొన్ని గ్రామాల్లో నీరులేక ఇబ్బందులు పడుతుంటే అధికారుల నిర్లక్ష్యంతో ఇలా నీరు వృథాగా పోతుందన్నారు.

నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : నిరుపేదలకు కల్యాణలక్ష్మి పథకం వరంగా నిలుస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యతనిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ కల్వల సత్యనారాయణ అధ్యక్షతన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు . అనంతరం మాట్లాడుతూ.. మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని గత ప్రభుత్వం 7 లక్షల కోట్ల అప్పుతో కాంగ్రెస్‌కు అప్పగించిందని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందిస్తూ, ఉద్యోగులకు వేతనాలు అందిస్తుందన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంట్ బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తూ, ఆర్టీసీలో మహిళల ప్రయాణ బిల్లులను సైతం చెల్లిస్తుందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. వచ్చే ఏడాది జనవరి 3 నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు దసరా పండుగకు మహిళల పేరుపై ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. మాజీ ఎంపీపీ చంద్రప్రకాశ్, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎమ్మార్వై శరత్‌కుమార్, ఏఆర్ఐ రమేశ్, పరకాల ఏఎంసీ డైరెక్టర్లు శానం కుమారస్వామి, వైద్యుల వెంకటరాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, సంపత్‌రావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ గ్రామాలు


నడికూడ : జీపీ సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి


దామెర : గ్రామసభలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి


కమలాపూర్ : ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పంబాలవాడ వాసుల

నడికూడ : ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు స్వచ్ఛగా మారుతాయని గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి అన్నారు. అనంతరం 2025–2026 సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో చేపట్టాల్సిన పనులపై గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు పని కల్పించనున్నట్లు తెలిపారు. జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఉపాధిహామీని వినియోగించుకోవాలని అన్నారు. గ్రామస్తులు తాగునీరు, వీధిలైట్లు, చెత్త సేకరణతో పాటు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని అన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని, పంచాయతీ సిబ్బందికి గ్రామస్తులు సహకరించాలని అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛభారత్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. జీపీ సిబ్బందికి శాలువాతో సన్మానించి, యూనిఫామ్స్ అందించారు.

దామెర: ఎన్ఆర్ఈజీఎస్ పనులను కూలీలు, లబ్ధిదారులు వినియోగించుకోవాలని దామెర, ఆత్మకూరు మండలాల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించి మాట్లాడారు. 2025–26 సంవత్సరంలో చేపట్టే పనులను గుర్తించి గ్రామసభల్లో ఆమోదం పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, ఈసీ రాజేశ్, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలోని వివిధ గ్రామాల్లో గల పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామ పంచాయతి ఆదాయ, వ్యయాలు చదివి వినిపించారు. మండల కేంద్రంలో జరిగిన గ్రామసభలో నిధుల దుర్వినియోగంపై, సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్నామని, కానీ అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారని, ధృవీకరణ పత్రాల జారీలో పలు అవకతవకలు జరిగాయని స్థానికుడు పబ్బు సతీష్‌తో పాటు పలువురు ఈఓ రమణారెడ్డికి తెలిపారు. పంబాలవాడ సమీపంలోని సర్వే నంబరు 900లో ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన సెల్ టవర్ నిర్మాణ పనులు చేపడుతున్నారని, స్థానికులు రేడియేషన్‌తో అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయని తెలిపారు. సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలని ఈఓకు వినతిపత్రం అందజేశారు. 2025–26 సంవత్సరానికి ఉపాధి హామీ పథకానికి సంబంధించి కొత్త పనులు గుర్తిస్తూ తీర్మాణం చేశారు. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ జయరాజు, కాంగ్రెస్ నాయకులు రమేశ్‌గౌడ్, పర్శరాములుగౌడ్, జగన్, రాము, పరశురాములు, మహేందర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



ఆత్మకూరు : కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. హౌజుబుజుర్గు గ్రామంలో బుధవారం సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అన్ని నెరవేరుస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మార్క సుమలత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

భూమి ఇప్పించి న్యాయం చేయండి



దామెర : తమ భూమిని తమకు ఇప్పించి, తమపై హత్యాయత్నానికి యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలంటూ బాధిత కుటుంబం తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. ముస్త్యాపల్లికి చెందిన చిలువేరు భిక్షపతి కుటుంబ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని 255–1 సర్వేనంబర్‌లో 2.04 ఎకరాల అసైండ్ భూమిని ప్రభుత్వం ఇచ్చిందన్నారు. 255–2 సర్వే నంబర్‌లో అదే గ్రామానికి చెందిన బండారి సుజాతకు 4 గుంటల భూమి ఉందని, కానీ అక్రమంగా 39 గుంటల భూమిని వారి భర్త పేరున పట్టా చేసుకున్నారని ఆరోపించారు. వాళ్ల అక్రమంగా పట్టా చేసుకున్న భూమిలో తమ భూమి ఉందంటూ ఆరోపించారు. అక్రమంగా ప్రవేశించి సాగుచేసే ప్రయత్నం చేశారని తెలిపారు. రెండు రోజుల క్రితం వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా సుజాతతో పాటు మరో ఇద్దరు గొడ్డలితో దాడిచేసి హత్యాయత్యానికి యత్నించినట్లు తెలిపారు. తమ భూమిని తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

బెల్టుషాపులపై పోలీస్‌ల దాడులు

ఐనవోలు : మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో రెండు బెల్టుషాపులపై దాడులు నిర్వహించినట్లు పోలీస్ తెలిపారు. ఈ దాడుల్లో కారింగుల కృష్ణవేణి షాపులో రూ.7,620 విలువచేసే మద్యం, నారబోయిన రాజ్‌కుమార్ షాపులో రూ. 10,140 విలువగల మద్యం స్వాధీనం చేసుకన్నట్లు తెలిపారు. ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించడంతో పాటు షాపు యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

పొలాలకు వెళ్లే దారిని బాగుచేయాలి

ఐనవోలు : మండల కేంద్రం నుంచి మాసినపల్లి చెరువు మీదుగా కక్కిరాలపల్లి గ్రామానికి వెళ్లే దారిని ఉపాధిహామీ పనుల్లో మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరారు. బుధవారం గ్రామసభ నిర్వహించగా జీఎంపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిన్నరాజు అధికారులను కోరారు. దారి గుండా నిత్యం వందలాది మంది రైతులు వ్యవసాయ భూముల వద్దకు వెళ్తారని, దారిని బాగుచేయాలని అన్నారు.

ఘనంగా లియాఫీ ఆవిర్భావ దినోత్సవం



కాశిబుగ్గ: లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) ఆవిర్భావ దినోత్సవాన్ని వరంగల్ -2 టీం ఆధ్వర్యంలో కాశిబుగ్గ మదర్‌థెరిస్సా హోంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథల మధ్య కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఏజెంట్లు మాట్లాడుతూ అందరికీ జీవిత బీమా అందించాలనే ఉద్దేశంతో నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లియాఫీ సభ్యులు (ఏజెంట్లు) రఘునారెడ్డి, రాజిరెడ్డి, కుమారస్వామి, తిరుపతిరెడ్డి, వీరస్వామి, శ్రీను, కోటేశ్వర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.